సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 10 । ఆగస్టు । 2025

గరిష్టం/కనిష్టం
31.0/24.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.





సెల్ఫీ విత్ రాఖీ

ఈ ఏడాది రక్షాబంధన్ సందర్భంగా 'సాక్షి' సెల్ఫీ విత్ రాఖీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా నలుమూలల నుంచి పాఠకులు అనూహ్యంగా స్పందించారు. తోబుట్టువులతో రాఖీ సెలబ్రేషన్స్‌ను మొబైల్‌లో క్లిక్ మనిపించారు. ఆ ఫొటోలను వాట్సాప్ ద్వారా పంపించారు.

- మరిన్ని చిత్రాలు 9లో▸

న్యూస్‌రీల్

ఆదివాసీ మహిళకు ప్రశంస



మెమొంటో అందుకుంటున్న ఆత్రం సుశీల

బోథ్: మండలంలోని బాబెర గ్రామానికి చెందిన స్వచ్ఛగృహి అవార్డుగ్రహీత ఆదివాసీ మహిళ ఆత్రం సుశీల ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా నుంచి సుశీలకు ఆహ్వానం అందింది. శనివారం భోపాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గతంలో ఈమె గవర్నర్ చేతుల మీదుగా స్వచ్ఛగృహి అవార్డు అందుకున్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చర్యలు

కైలాస్‌నగర్: జిల్లాలోని రెండు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. తాంసి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ చేసినట్లుగా తెలిపారు. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో పనిచేసే కోచ్ తనబిడ్డపై అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధిత విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి పోక్సో కేసు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా విద్యాసంస్థల్లో విచారణ చేపట్టిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ స్పోర్ట్స్ స్కూల్ కోచ్‌ను టర్మినేట్ చేయాలని, తాంసి పాఠశాల ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేయగా, కోచ్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లుగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు ప్రవర్తనా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కొత్తపట్టాపాస్ బుక్ పొందిన రైతులు రైతు బీమా కోసం ఈనెల 13వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి ప్రకటనలో తెలిపారు. ఈఏడాది జూన్ 5 వరకు కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతులు 2025 పాలసీలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. జిల్లా లోని 21 మండలాల్లో గల 101 రైతు వేదికల్లో బీమా నమోదు కార్యక్రమాన్ని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు చేపడుతున్నారని తెలిపారు. ఇది వరకు పాస్‌బుక్ ఉండి రైతు బీమా నమోదు చేసుకోని 18 నుంచి 59 ఏళ్ల లోపు రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇది వరకు నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు.

హస్త కళా ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను తిలకిస్తున్న జనం

ఆదిలాబాద్‌టౌన్:పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన స్వదేశీ హస్తశిల్ప కళా ప్రదర్శన ఆకట్టుకుంటుంది. రాజస్తానీ హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు విక్రయాలు సాగిస్తున్నారు. శనివారం ప్రారంభమైన ప్రదర్శన ఈ నెల 20వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

'టోల్' మినహాయించాలి

నేరడిగొండ: తమ వాహనాలకు టోల్ మినహాయింపు ఇవ్వాలని రోల్‌మామడ టోల్‌ప్లాజాకు సంబంధించి 20 కిలోమీటర్ల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. శనివారం ఎన్‌హెచ్ఏఐ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆధార్‌పత్రాలు చూసి తమ వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు.

అభిమానం.. రాఖీలో



కేటీఆర్ ఫొటోతో ఉన్న రాఖీ

బోథ్: రాఖీ పౌర్ణమి సందర్భంగా బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు ఆయన సోదరి కేటీఆర్ ఫొటోతో ఉన్న రాఖీ కట్టారు. కల్వకుంట్ల తారక రామారావును ఎంతో అభిమానించే తన తమ్ముడి కోసం ప్రత్యేకంగా తయారు చేయించినట్లు ఆమె తెలిపారు.

రాఖీ కట్టి.. శుభాకాంక్షలు చెప్పి

ఎంపీ గొడం నగేశ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణి..



ఎమ్మెల్యే శంకర్‌కు రాఖీ కడుతూ..



తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క





ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు

సోదర, సోదరీమణుల మధ్య ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకలను జిల్లా వాసులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. రాఖీలు కట్టిన అక్కాచెల్లెళ్లకు అండగా ఉంటామని సోదరులు అభయమిచ్చారు. ఎంపీ గోడం నగేశ్‌కు స్వగ్రామమైన జాతర్లలోని నివాసంలో ఆయన సోదరీమణులు కృష్ణకళ, కమలబాయిలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో ఆయన సోదరీమణులు రాఖీలు కట్టారు. నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆయన సోదరీమణులు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. - ఆదిలాబాద్/బజార్‌హత్నూర్

అండగా ఉంటాం..

- యూనివర్సిటీ సాధనకు అన్ని విధాలా ప్రయత్నిస్తాం
- జిల్లాలో ఉన్నత విద్యావకాశాల కల్పనకు కృషి చేస్తాం
- జిల్లావాసులకు భరోసానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



విద్యార్థులతో కలిసి ఇటీవల నిర్వహించిన సదస్సులో నినాదాలు చేస్తున్న వర్సిటీ సాధన సమితి సభ్యులు

జిల్లాలో విశ్వవిద్యాలయ సాధన కోసం ఈ ప్రాంతవాసులు గొంతెత్తి నినదిస్తున్నారు. 'సాక్షి' డిబెట్‌తో ఏర్పడిన యూనివర్సిటీ సాధన సమితి ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణతో ముందడుగు వేసింది. ఉద్యమబాట పట్టింది. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఇప్పటి వరకు జరిగిన నష్టంపై విద్యార్థులు, నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తోంది. వర్సిటీ ఆవశ్యకతను వివరిస్తూ ముందుకు సాగుతోంది. విద్యావంతులు, మేధావులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతుండగా.. ప్రజాప్రతినిధులు సైతం అండగా ఉంటామంటున్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో తాము భాగస్వాములమవుతామని పేర్కొంటున్నారు. వర్సిటీ సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు.

- కైలాస్‌నగర్/బజార్‌హత్నూర్

జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి



కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు ఏ చిన్న పనికైనా 300 కిలోమీటర్ల దూరంలో గల వరంగల్‌కు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులకు సమయం వృథాతో పాటు దూరభారం అవుతుంది. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే అధిక సంఖ్యలో గిరిజనులు, గిరిజనేతర విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించే అవకాశం ఉంటుంది. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నా వంతు కృషి చేస్తాను. అలాగే జిల్లాలో నవోదయ ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేస్తున్నాను.

- గోడం నగేశ్, ఎంపీ, ఆదిలాబాద్

ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించా..



జిల్లాకు యూనివర్సిటీ అవశ్యకత ఎంతో ఉంది. దీనిని గుర్తించే తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే నేను ప్రస్తావించాను. ప్రభుత్వానికి విన్నవించాను. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటైతే విద్యాపరంగా ఈ ప్రాంతవాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అందుకోసం నా వంతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా. విశ్వవిద్యాలయం మంజూరయ్యేలా కృషి చేస్తా.

- పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్, బీజేఎల్పీ ఉపనేత

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో ఉన్నత విద్య కోసం ఇక్కడి యువత సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దూరభారంతో పాటు ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో విశ్వవిద్యాలయ ఏర్పాటు కోసం ఎలాంటి ఉద్యమాలు చేపట్టినా నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. ప్రత్యక్ష పోరాటంలోనూ కలిసి వస్తాను. అలాగే అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తాను. ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి తీసుకొస్తాను.

- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

సీఎం దృష్టికి తీసుకెళ్లాను..



యూనివర్సిటీ ఏర్పాటు డిమాండ్ జిల్లావాసుల్లో సుదీర్ఘ కాలం నుంచి వ్యక్తమవుతుంది. అది న్యాయబద్ధమైంది కూడా. ఇదే అంశాన్ని నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. జిల్లాలో విశ్వవిద్యాలయ ఆవశ్యకతను సీఎంకు వివరించాను. ప్రజల డిమాండ్, జిల్లా అవసరాలకు అనుగుణంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిందే. ఇందుకోసం నా వంతుగా అన్నివిధాలా కృషి చేస్తా. జిల్లాకు న్యాయం జరిగేలా చూస్తాను.

- వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

'సంక్షేమ' తిప్పలు!

- ప్రభుత్వ పథకాల కోసం పాత మండలాలకే..
- కొత్త మండలాల్లో అందుబాటులోకి రాని సేవలు
- జిల్లాలోని 46 గ్రామాల ప్రజలకు అవస్థలు



నార్నూర్ ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు (ఫైల్)

కైలాస్‌నగర్: తెల్లరేషన్ కార్డు కలిగిన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. మహాలక్ష్మి పథకం ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగిన వారికి రూ.500కే సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి కింద ఉచిత కరెంట్ అందిస్తోంది. ఈ పథకాలకు అర్హులైనప్పటికీ రేషన్‌కార్డులు లేకపోవడంతో జిల్లాలో చాలామంది పేదలు ఇన్ని రోజులు సంక్షేమ లబ్ధికి దూరమయ్యారు. ప్రభుత్వం ఇటీవల కొత్త కార్డులు జారీ చేయడంతో వీరికి అవకాశం లభించింది. దీంతో కార్డులు పొందిన వారు తమ మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను ఆశ్రయించి వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. అయితే కొత్తగా ఏర్పడ్డ మండలాల్లో మాత్రం ఈ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఎంపీడీవో కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ ఆయా పథకాల లబ్ధి కోసం పాత మండలానికే పయనమవ్వాల్సిన పరిస్థితి. దీంతో పేదలకు వ్యయ, ప్రయాసలు తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మూడు మండలాల్లో ఇదే పరిస్థితి..

జిల్లాలో ఇటీవల సాత్నాల, భోరజ్, సొనాల మండలాలు కొత్తగా ఏర్పడిన విషయం విదితమే. సొనాల మండలంలో 12 గ్రామాలు ఉండగా, సాత్నాలలో 17, భోరజ్‌లో 17 గ్రామాలు కలిపి మూడు మండలాల పరిధిలో 46 గ్రామాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రభుత్వ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయా గ్రామాల్లోని కొత్తగా రేషన్ కార్డులు కలిగిన అర్హులైన వారంతా తిరిగి తమ పాత మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. సాత్నాల మండల వాసులు ఆదిలాబాద్ రూరల్, బేల, జైనథ్‌కు వెళ్లాల్సి రాగా.. భోరజ్ మండల వాసులు జైనథ్‌కు, సొనాల మండలవాసులు బోథ్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. అయితే కొత్త మండలాల్లో ఎంపీడీవోలు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజాపాలన కేంద్రాల నిర్వహణకు అవసరమైన లాగిన్లను ప్రభుత్వం ఇంకా కేటాయించలేదు. దీంతో అక్కడ దరఖాస్తులను స్వీకరించే అవకాశం లేకుండా పోయింది.

గతంలో దరఖాస్తు చేసుకున్న వారికే ...

ప్రభుత్వం గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే రాయితీ పథకాలను ప్రభుత్వం వర్తింపజేస్తోంది. కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారు ప్రజాపాలన రశీదుతో పాటు ఉచిత విద్యుత్ కోసమైతే విద్యుత్ బిల్లు, కుటుంబీకుల ఆధార్ జిరాక్స్ ప్రతులను అందజేయాల్సి ఉంటుంది. అలాగే రూ.500 సిలిండర్ పథకం కోసమైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ నమోదు చేసుకుని ఉండాలి. వీటి కోసం ప్రస్తుతం ఆయా మండలాల వాసులకు తిప్పలు తప్పడం లేదు.

ప్రభుత్వానికి పంపించాం

కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లాగిన్లు కేటాయించినప్పటికీ ప్రజాపాలన కేంద్రాల లాగిన్లను ఇంకా ఇవ్వలేదు. వాటి కోసం ప్రభుత్వానికి సీజీజీ ద్వారా ప్రతిపాదనలు పంపించాం. వాటిని కేటాయించేలా ఫాలోఅప్ చేస్తున్నాం. త్వరలోనే ఆయా మండలాలకు లాగిన్లు కేటాయించే అవకాశముంది. అప్పటి వరకు అర్హులైన వారికి పాత మండలాల్లోనే ఆయా సేవలను అందిస్తున్నాం.

- జి.జితేందర్ రెడ్డి, జెడ్పీసీఈవో

ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్



కుమురంభీంకు నివాళులర్పిస్తున్న టీఏవీఎస్ నాయకులు, విద్యార్థులు

కైలాస్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆది వాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేస్తూ ఏజెన్సీలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని టీఏజీఎస్, టీఏవీఎస్ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలను వనవాసీలుగా చిత్రీకరించేందుకు చూస్తుందన్నారు. ఆదివాసీలు వనవాసీలు కాదని, ఈ దేశ మూలవాసులు అనే విషయాన్ని గ్రహించాలన్నారు. అలాగే ఆదివాసీ లను అడవికి దూరం చేసే విధానాలు మానుకోవాలన్నారు.ఏజెన్సీలో జీవో3ను పునరుద్ధరించాలని, 1/70, పిసా, చట్టాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతల రవీందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, టీఏవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్, నాయకులు ఉయిక విష్ణు, మడవి నాగోరావ్, కొట్నాక్ పుష్పలత, కొట్నాక్ సక్కు, కుమ్ర భీంరావు, నర్మద, మానిక్‌రావు పాల్గొన్నారు.

కుమురంభీం స్ఫూర్తితో పని చేయాలి

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్



మహనీయులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదివాసీ సంఘాల నేతలు

ఆదిలాబాద్‌రూరల్: జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమురంభీంను స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు పని చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను హీరా సుకా ఆదివాసీ జాగృతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హీరా సుకా దేవస్థానం వద్ద శనివారం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కుమురంభీం, రాంజీగోండ్, బీర్సాముండా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఆదివాసీలతో కలిసి సంప్రదాయ థింసా నృత్యం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ఆదివాసీ మహిళలు కలెక్టర్, ఎస్పీలకు రాఖీలు కట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్, నాయకులు కుర్సేంగే తానాజీ, షెడ్మకి గోద్రు, గోడం లక్ష్మణ్, మెస్రం శంకర్, కుర్సేంగే యాదవ్‌రావ్, సుభాష్, మనోహర్, ప్రకాశ్, వనిత బాయి, గీత, అనుసూయ, సంగీత పాల్గొన్నారు.

'రాఖీ' రద్దీ



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

రాఖీ పర్వదినం పురస్కరించుకొని మహిళా ప్రయాణికుల రాకపోకలతో ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ శనివారం కిటకిటలాడింది. 'మహాలక్ష్మి'లు పెద్ద ఎత్తున ప్రయాణం చేయడంతో బస్సులు కిక్కిరిసిపోయాయి. రద్దీతో తోపులాట సైతం చోటు చేసుకుంది. అలాగే బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణించాల్సి వచ్చింది. - ఆదిలాబాద్



ప్రయాణికులతో రద్దీగా మారిన ఆదిలాబాద్ బస్టాండ్

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని అంతర్రాష్ట్ర వంతెన సమీపంలోని ప్రాణహిత నదిలో నుంచి శనివారం తెల్లవారు జామున ఇసుక తరలిస్తున్న రెంటు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. వెలమపల్లికి చెందిన గోనె సత్యనారాయణ, మానిశెట్టి ప్రశాంత్‌తో పాటు డ్రైవర్లు అట్టెల వెంకటేశ్, జగన్‌పై కేసు నమోదు చేసి వాహనా లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

సోన్: వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన సంఘటన శనివారం మండలంలోని న్యూ వెల్మల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపు సాయవ్వ తన ఇంటి ముందు నిద్రపోతుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో తల, మెడపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోతుల బారి నుండి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన యువతి (25) తల్లి మందలించడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో వ్యభిచారం గృహంపై శనివారం దాడి చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన చేతన్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో ఓ ఇంటిని కొన్ని నెలల క్రితం నుంచి అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆ ఇంటికి పలువురు పురుషులు, మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అనుమానం కలిగిన కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఆ గృహంపై దాడి చేసి చేతన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో



చెట్ల పొదల్లో ఆటో

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిత వనం పార్కు సమీపంలో చెట్ల పొదల్లోకి ఆటో దూసుకెళ్లి బోల్తా పడింది. సిర్పూర్ మండలం చిలాటిగూడకు చెందిన ప్రయాణికులు మహారాష్ట్రలోని మహూర్ గ్రామానికి దైవదర్శనం కోసం ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం మావల సమీపంలో ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దేవ్‌రావు, మారుతి, మంగావతి, నాగోబాయికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ కిషన్, పైలట్ ముజఫర్ క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

తండాల్లో తీజోత్సవం

- గిరిజన గ్రామాల్లో మొదలైన సందడి
- పెళ్లికాని యువతులు నిర్వహించే పండుగ

కెరమెరి : తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ. గిరిజన యువతులు తమ ఆశలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించుకునే ఉత్సవం. ఆటపాటలు, విందులు, వినోదాలు, వినూత్న ఆచారాలతో బతుకమ్మ తరహాలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ వేడుకలు గిరిజన బంజారా (లంబాడా) తండాల్లో రక్షాబంధన్‌కు ప్రారంభమై కృష్ణాష్టమికి ముగుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వేడుకల్లో నిమగ్నం..

గిరిజన లంబాడాలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్' పండుగ జరుపుకోవడంలో నిమగ్నమయ్యారు. యువతులు కుల దేవతలను కొలుస్తూ బుట్టల్లో ఎర్రమట్టి నింపి అందులో గోధుమలు చల్లారు. వీటినే తీజ్ బుట్టలు అంటారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'తీజ్ భరాయిరో' అని పిలుస్తారు. ఆ రోజు నుంచి యువతులంతా నియమ నిష్టలు పాటిస్తున్నారు. గ్రామ ప్రజలకు మంచి జరగాలని, తమకు మంచి భర్త రావాలని కోరుకుంటూ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రతీరోజు మూడు పూటలా సమీపంలోని బావుల వద్దకు వెళ్లి నీటిని తీసుకువచ్చి బుట్టలపై చల్లుతున్నారు. ఆరు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.



గోధుమ నారుకు నీళ్లు చల్లుతున్న యువతులు

ఎనిమిదో రోజు 'ఘంగోర్' వివాహం

ఎనిమిదో రోజు యువతులంతా చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టితో ఆడ, మగ బొమ్మలను తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చీతో వేషధారణ చేస్తారు. వాటిని మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటుకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు ఘనంగా వివాహం జరిపిస్తారు. అక్కడే లాప్సీ (పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ' అంటే వారి కులదేవత 'మేరామయాడి' అని 'గోర్' అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

ఏడో రోజు 'ధమోళీ' సందడి

ఏడో రోజున ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేస్తారు. వాటిని బెల్లం, నెయ్యితో కలుపుతారు. ఈ మిశ్రమాన్నే చూర్మా అంటారు. ఈ చూర్మాను తీజ్ బుట్టలున్న ఇంటి ఆవరణలో నెలకొల్పిన కుల దేవుడు 'సేవాభయ్య'కు నైవేద్యంగా సమర్పిస్తారు. అదే రోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు, వాటి ముందు నీళ్ల కడవ ఉంచి అందులో వేప మండలు పేరుస్తారు. ఆ కడవ ముందు జొన్నపిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామయాడి' తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజలు చేస్తారు. మేరామయాడి దేవత మాంసాహారి కావడంతో ఆమెకు మేకపోతును బలిస్తారు. ఆరోజు రాత్రి యువతులు ఇంటింటికీ వెళ్లి చూర్మా సేకరిస్తారు. వర్షైన వారికి పూస్తూ నృత్యం చేయడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ కోలాహల ప్రక్రియనే 'ధమోళీ'గా వర్ణిస్తారు.

తొమ్మిదో రోజు..

తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. ఆ రోజు యువతులంతా ఇంటింటికీ వెళ్లి తీజ్‌లను తెంపడానికి అందరూ రావాలని ఆహ్వానిస్తారు. వారంతా వచ్చిన తర్వాత మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్' నారును తెంపుతారు. దానిని వరుసగా కూర్చున్న మగవారి తలపాగలో పెడతారు. ఆడవారైతే కొంగుకు కట్టుకుంటారు. మరికొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయలు దేరుతారు. సమీపంలోని చెరువులు లేదా బావుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ రోజు ప్రక్రియను 'తీజ్ ఎరాయోరో' పిలుస్తారు. దీనిని ఒకరకంగా లంబాడీ బతుకమ్మగా కూడా భావిస్తారు. గోర్‌బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారవుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

సంతోషంగా..



శ్రావణమాసంలో నిర్వహించే తీజ్ పండుగంటే మాకు ఎంతో ఇష్టం. బుట్టల్లో ఉన్న గోధుమలకు తొమ్మిది రోజులు నీళ్ల చల్లి చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడం వల్ల అన్నికార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతున్నారు. పాడి పంటలతో పాటు ఇంటిల్లిపాది, గ్రామస్తులు సుఖశాంతులతో ఉంటారు.

– జే.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

ఈవో కార్యాలయం ప్రారంభం



కార్యాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: బాసర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయ కార్యనిర్వహణాధి కారి కార్యాలయాన్ని శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గోమాతతో భవన ప్రవేశం, వాస్తుపూజ, మహా హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి నుంచి నూతన కార్యాలయంలో అధికారులంతా విధులు నిర్వహిస్తారని ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు, పీఆర్‌వో నారాయణ పటేల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం..

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని దస్నాపూర్ కాలనీలో శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించడంతో భయాందోళన చెందిన స్థానికులు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారి సిబ్బందిని అప్రమత్తం చేసి కాలనీకి పంపించారు. జిల్లా అటవీశాఖ అధికారి సీసీ ఇసాక్ ఆధ్వర్యంలో బీట్ అధికారులు కిషోర్, ఎం.వెంకటేష్, మారుతి, పి.వెంకటేష్ గంటపాటు శ్రమించి దానిని ఒక సంచిలో బంధించి అటవీప్రాంతంలో వదిలేశారు. సమయానికి స్పందించిన అటవీ శాఖ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కంటెయినర్‌ను ఢీకొని యువకుడి మృతి

- రాఖీ కట్టించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం
- బాసరలో పండుగపూట విషాదం



సాయిబాబు (ఫైల్)

బాసర/నవీపేట: రాఖీ పండుగను పురస్కరించుకుని ఓ సోదరుడు అక్కతో రాఖీ కట్టించుకొని స్కూటీపై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయినాథ్, కవిత దంపతులకు కుమార్తె సాయిప్రియ, కుమారుడు సాయిబాబు అలియాస్ బబ్లూ (19) ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం బబ్లూ నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్‌లో ఉంటున్న కవిత వద్దకు చిన్నాన్న కుమారుడైన అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా అబ్బాపూర్(ఎం)–జగ్గారావు ఫారమ్ మధ్యలో ముందుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బబ్లూ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నిర్మల్‌రూరల్: చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీకి చెందిన మహేష్ తనకు వరుసకు చెల్లెళ్లు అయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టించుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ముగ్గురు ఎగిరి కిందపడడంతో మహేష్, అర్చనకు తీవ్రంగా ఆద్యకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అందుబాటులో లేకపోవడంతో ట్రాలీలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్చన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలలో శోధిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషయం తెలుసుకుని..దాతృత్వం చాటి..

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ రూరల్ మండలం చిట్యాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన అర్చనను జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం జరగడంతో 'ఏ' నెగిటివ్ రక్తం అవసరమైంది. అరుదుగా లభించే ఈ రక్తగ్రూపు కోసం సామాజిక మాధ్యమాల్లో చేరవేయగా విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన బండారి సాయిరాహుల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. సమయానికి రక్తదానం చేసిన యువకుడిని పలువురు అభినందించారు..



రక్తదానం చేస్తున్న సాయిరాహుల్

నిర్మలం.. హృదయ రంజితం



గండిరామన్న హరిత పార్కు చుట్టూ పచ్చదనంతో అటవీ ప్రాంతం

ప్రకృతి శోభకు పెట్టింది పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఈ అడవుల్లో ఉన్న చెట్లకు ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చగా ఆకులు చిగురించి ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. నిర్మల్ జిల్లా పరిసరప్రాంతాల ప్రజల హృదయాలను రంజింపజేస్తున్న ఈ ప్రకృతి చిత్రాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జిల్లా కేంద్రం శివారులో పచ్చదనంతో అటవీ ప్రాంతం



ఆదివాసీ సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా ఆదివాసీ దినోత్సవం



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



డప్పుచప్పుళ్లతో కలెక్టర్, ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు హాజరయ్యారు. ముందుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీతో కలిసి భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రపంచ ప్రసిద్ధి పొందాయన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా పీవీటీజీ గిరిజనులు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా 180 అంబులెన్స్‌లను పీవీటీజీ గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. పీవో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పీవీటీజీ గిరిజనులకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా విద్య, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదివాసీల సంప్రదాయ బద్ధమైన పూజలు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాలతో కుమురంభీం ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, సర్‌మేడీలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో..

మండల కేంద్రంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆదివాసీ నాయకులు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన మోర సాయి (32) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితం అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార నిందితుడి గాలింపునకు ప్రత్యేక బృందాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీచౌక్‌లో 78 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి కోసం వన్ టౌన్ పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్ర వాసిగా అనుమానిస్తున్న నిందితుడు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ వైపు వెళ్లి ట్రెయిన్‌లో పరారైనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సీసీ పుటేజీలో నిందితుడి కదలికలను గమనించినట్లుగా ఆయన పేర్కొన్నారు

నాగోబాకు నొవోంగ్ పూజలు



పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా మురాడి వద్ద మెస్రం వంశీయులు శనివారం నొవోంగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మెస్రం వంశ పెద్దలు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన చిరు ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి నాగోబాకు సమర్పించారు. అనంతరం తమ గ్రామాలకు వెళ్లి నొవోంగ్ పూజలు చేయనున్నట్లు తెలిపారు. నొవోంగ్ పూజల చేస్తేనే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన చిరుధాన్యాలను తెంపడం జరుగుతుందని మెస్రం వంశ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, హనుమంత్‌రావ్, దేవ్‌రావ్, లింబారావు, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన: పోరాటాల ద్వారానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇప్పటి వరకు డైరెక్టర్ స్థాయి అధికారులతో కమిటీ సమావేశాలు జరిపినా కార్మికులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మాఫీ వంటి దీర్ఘకాలిక సమస్యలను ఎన్నికల్లో గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికై 18 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. యాజమాన్యంతో ములాఖత్ అయి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని, ఇచ్చిన హామీలపై గనులపై నిలదీయాలని పిలుపునిచ్చారు. జూలై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్మికులందరికి రీ మెడికల్ నిర్వహించి అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, ఏరియా కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్లు ఎస్‌కే ఇనూస్, మరిశెట్టి దత్తు, పిట్ కార్యదర్శి ఎండీ ఆరీఫ్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు తిరుపతి, బాలేష్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెంకు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం ప్రాజెక్టుకు శనివారం 1,707 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. – కడెం